# బీజేపీలోకి జడ్పీ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి..?

**బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా జడ్పీ ఛైర్మెన్..**

**సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న బీజేపీ కార్యకర్తలతో దిగిన ఫోటోలు..**

**కేవలం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ..బీఆర్ఎస్ కు దూరంగా ఉంటున్న జడ్పీ ఛైర్మెన్..**



బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న జడ్పీ ఛైర్మెన్

**వనపర్తి ప్రతినిధి,జనవరి 13 ప్రభాతవార్త:** వనపర్తి జడ్పీ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి త్వరలోనే బీజేపీ లో చేరుతారనే ప్రచారానికి రోజు రోజుకు బలం చేకూరుతుంది. గత 15రోజుల క్రితం వనపర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, మంత్రి సమక్షంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా పని చేస్తున్న లోక్‌నాథ్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంచాలని నిర్ణయించిన నేపథ్యంలో అప్పటి నుండి లోక్‌నాథ్ రెడ్డి కూడా అడపదడపగా ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొంటూ బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకుండా దూరంగా ఉండడం కొనసాగుతుంది. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని బీజేపీ అనుబంధ శాఖ అయిన బీజేవైఎం ఆధ్వర్యంలో గాంధీనగర్ 5వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీకి జడ్పీ ఛైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించి బహుమతులు ఇవ్వడం వనపర్తి లో చర్చనీయంశంగా మారింది, బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.నారాయణ, జిల్లా, రాష్ట్ర నాయకులు అనుజ్ఞా రెడ్డి,శ్రీశైలం, మహిళా నాయకురాలు వారణాసి కల్పన, 4వ వార్డు కౌన్సిలర్ పద్మ భర్త మాజీ జిల్లా బీజేపీ పార్టీ కార్యదర్శి పరుశురాం, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి శివసాగర్, బీజేపీ కార్యకర్తలతో కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. లోక్‌నాథ్ రెడ్డి బీజేపీ లో చేరడం ఖాయమంటూ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు మెమొంటోలు అందజేస్తున్న జడ్పీ ఛైర్మెన్

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# సంబురాల.. సంక్రాంతి..

- భోగితో మొదలయ్యే మూడు రోజుల పండుగ
- ఇండ్ల ముందు ముగ్గులు..గొబ్బెమ్మలతో వేడుకలు
- ఇండ్లకు బంతి పూలు, మామిడి ఆకులతో తోరణాలు
- గాలిపటాలు, ఎద్దులబండ్ల పోటీలు
- ఉత్సాహంగా జరుపుకొనేందుకు సిద్ధమైన ప్రజలు







ఏర్పాటు చేసిన రంగుల దుకాణం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి13, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను ఉత్తరాయణగా పిలుస్తారు. ఎందుకంటే మకర సంక్రాంతి రోజు నుంచి సూర్యుడు ఉత్తరం వైపు పయనిస్తాడు. ఈ సమయంలో పంటలు చేతికొస్తాయని కాబట్టి పండుగను ఘనంగా నిర్వహిస్తారు. ఈపండుగను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఏదైనా పండుగ ఒక్క రోజు మాత్రమే ఉంటుంది..కానీ సంక్రాంతి మూడు రోజులు జరిపే ముచ్చటైన పండుగ. పండుగకు మూడు నాలుగు రోజుల ముందే నుంచే ఆడపడుచుల సంబురాలు ప్రారంభమవుతాయి. ముగ్గులు వేయడానికి రంగులు, తోరణాలకు బంతి పూలు ఇలా ఒక్కటేమిటి, పిల్లలు ఎగరేసే గాలిపటాల వరకు సందడిసందడిగా గడుపుతారు. ప్రతి నెల జనవరి నెలలో మకర సంక్రాంతిని ఘనంగా జరుపుకొంటారు. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి సంచరించే సమయాన్ని ఖసంక్రాంతి' అంటారు. అదే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని మకర సంక్రాంతి అంటారు.



జడ్చర్లలో గాలిపటాల వద్ద సందడి

హిందువుల పండుగల్లో సంక్రాంతి పండుగ మాత్రమే సూర్యుడు గమనాన్ని అనుసరించి జరుపుకోవడం జరుగుతుంది. మనం రోజు ఉపయోగించే గ్రెగోరియన్ క్యాలెండర్ కూడా సూర్య గమనాన్ని అనుసరిస్తుంది కాబట్టి సంక్రాంతి ప్రతి ఏడాది ఒకే రోజున వస్తుంది. సాధారణంగా సంక్రాంతి ప్రతి ఏడాది జనవరి 14న వస్తుంది.కానీ లీపు సంవత్సరంలో మాత్రం 15న వస్తుంది. అందుకే ఈ సంవ్సతరం పండుగ జనవరి 15న వచ్చింది.

**భోగి మంటలు..** జనవరి 14న భోగి పండుగ జరుపుతారు. తెల్ల వారకముందే అందరూ లేచి భోగి మంటలు వెలిగి స్తారు. చలి గాలులను పారద్రోలడానికే మాత్రమే కాకుండా ఇంట్లో ఉండే పాత చీపుర్లు,తట్టలు,విరిగి పోయిన బల్లలూ ఇలా పాత వస్తువులను మంట లో వేస్తారు. అంటే కొత్త వాటితో నిత్య నూతన జీవితం ఆరంభించడానికి గుర్తుగా కూడా భోగి మంటలు వేస్తారు.

**సంక్రాంతి..** రెండో రోజు సంక్రాంతి పండుగ జరుపుతారు. పాలు పొంగించి, స్వీట్లు తయారు చేస్తారు. ఇండ్ల ముందు అందంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, గరిక, రేగి పండ్లు,నవ ధాన్యాలు పోస్తారు. అందరూ తమ ఇండ్లల్లో పిండివంటలు చేస్తారు. అరిసెలు, బొబ్బట్లు, చక్కినాలు, పరమాన్నం, మొదలైన వంటకాలు చేసి కొత్త బట్టలు ధరించి ఘనంగా నిర్వహించుకుంటారు.

**కనుమ..** మూడో రోజు కనుమ. వ్యవసాయంలో తమకు చేదోడువాదోడుగా ఉన్నందుకు పశువులకు శుభాకాంక్షలు తెలుపడానికి కనుమ పండుగ జరుపుతుంటారు.కొన్నిప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తుంటారు.ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతంలో. అయితే జీవహింస నేరంగా భావించి ప్రభుత్వం వాటిని నిషేధించింది.అయినా స్థానిక నాయకులు, పోలీసుల అండతో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తుంటారు. అయిదే కనుమ రోజు మాంసాహారం తినడం తెలుగు రాష్ట్రాల్లో ఆనవాయితీ. ఏ రాష్ట్రంలో ఏ పేరు సంక్రాంతి పండుగను ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉత్తర భారతంలో మాఘి అని లోహ్రి అని, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఖిచిడి అని, రాజస్థాన్, గుజరాత్‌లో ఉత్తరాయణ లేదా పతంగుల పండుగ అని, తమిళనాడులో పొంగల్ అని, మధ్యభారత్‌లో సుకరాత్, అస్సాంలో మఘ్ బిహు అని పిలుస్తారు. దక్షణభారత దేశంలో మకరసంక్రాంతిగా పేర్కొంటారు.

**కానరాని హరిదాసుల కీర్తనలు..** అయ్యగారికి దండం పెట్టు..అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దులతో హరిదాసులు చేసే సందడి కనుమరుగవుతున్నది.లోకంలో ఉండే సుఖాలకు లొంగిపోయి దేవుడిని మర్చిపోవొద్దని హరిదాసు కీర్తనలు పాడుతాడు. హిందువుల నమ్మకం ప్రకారం హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మానవులు ఇచ్చే దానధర్మాలు పొంది వారికి ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవించేవారు హరిదాసులు. కాలక్రమంలో హరిదాసుల కీర్తనలు కనుమరుగయ్యాయి.గంగిరెద్దులతో నృత్యాలు చేయిస్తూ కనువిందు చేసే దృశ్యాలు కానరాకుండా పోయాయి. పట్టణాల్లో కాదు..పల్లెల్లోనూ ఇలాంటి దృశ్యాలు వింతే అని చెప్పడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు.

# అలసత్వమా... అసమర్ధతనా..!

## – గ్రామాల్లో కుంటు పడుతున్న అభివృద్ధి...

**వంగూరు, జనవరి 13, ప్రభాతవార్త:** పల్లెల అభివృద్దే ధ్యేయంగా సర్పంచ్‌లు, గ్రామ స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకొని నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుంటే కొందరు మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులతో కుమ్మక్కై సర్పంచ్‌లను, కార్యదర్శులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్న కూడా నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపన పోలేదు. గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను అభివృద్ధి పనులకు కేటాయించేందుకు మండల స్థాయి అధికారి నిర్లక్ష్యం వహించిన కూడా కొంత మంది మాత్రం మాకు నచ్చినట్లు వ్యవహరిస్తే మిగతా సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు ఎన్ని ఇబ్బందులు పడిన కూడా మాకెంటి అనే ధోరణిలో ఆ అధికారిణిని వెనకేసుకొచ్చి తమ పనులను కానించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో చోటు చేసుకుంటున్న పనులను పర్యవేక్షించడానికి ఓ జిల్లా అధికారి వస్తే ఆ జిల్లా అధికారిణి కూడా గెట్ అవుట్ అని పంపించిన విషయం



మండల ప్రజా పరిషత్ కార్యాలయం

జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించిన కూడా సదరు అధికారిపై చర్యలు చేపట్టకపోవడంలో అంతార్యమేమిటని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ఏ పని కోసం అయినా ప్రజా ప్రతినిధులు కార్యాలయానికి వస్తే తాను చెప్పింది వింటేనే కార్యాలయంలోకి వచ్చేందుకు అనుమతి ఇస్తూ, లేనిచో బయటకు వెళ్లాలని హుకుం జారీ చేసి తాను ఇష్టానుసారంగా ప్రజా ప్రతినిధులను దుర్భషలాడుతున్న మండలాధికారిణి ప్రజా ప్రతినిధులకు అనుకూలంగా మార్చేందుకు అధికార పార్టీ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు కుదటపడటం లేదని చెప్పుకోవచ్చు. మండలంలో చోటు చేసుకునే విషయంలో నియోజకవర్గ నాయకుడికి తెలియకుండా ఇక్కడ అంత మంచే జరుగుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనులు చేపడుతున్నారని సూచించడం వల్ల గ్రామాలాభివృద్ధి కుంటు పడుతుందని పలువురు అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు బాహాటంగా విమర్శిస్తున్నారు. కొంత మంది మండల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఆ మండలాధికారి అనుకూలంగా ఉండటంతో క్రింది స్థాయి అధికారులను, ప్రజా ప్రతినిధులను పట్టించుకోకుండా తమ పనులు తాము చేసుకొని వెళితే అయిపోతుందిలే అనే ధోరణిలో వ్యవహరించడం వల్ల వంగూరు మండల పరిస్థితి దయనీయంగా మారింది. సదరు మండలాధికారిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులకు పూర్తి స్థాయిలో సమాచారమిచ్చినప్పటికి కూడా పట్టించుకోకపోవడంలో అంతార్యమేమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

### ఈ సారూ మాకొద్దు...

పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తే కార్యాలయంలోకి రానివ్వకుండా ప్రజా ప్రతినిధులు అనే గౌరవం ఇవ్వకుండా దుర్భషలాడుతూ నియంతలా వ్యవహరిస్తున్న మండల ఎంపీడీఓ మాకొద్దు అని పలుమార్లు ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులకు సూచించిన పట్టించుకోవడంతో మా సమస్యలన్ని పేరుకుపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులను ఆగౌరవ పరుస్తూ తనకిష్టమొచ్చిన భాషలో దూషిస్తున్న కూడా మండల అధికారిపై చర్యలు తీసుకొని వంగూరు మండలం నుంచి పంపించాలని ఆయన కోరారు.



పోతారెడ్డిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

### ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదా.?

ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తూ ఆదినాయకులకు అండగా ఉంటున్న ప్రజా ప్రతినిధులను అగౌరవ పరుస్తూ మండల అధికారి వ్యవహరిస్తున్న తీరు ప్రజా ప్రతినిధులకే సిగ్గుచేటుకరంగా మారిందని జాజాల గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఆరోపించారు.చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేయమంటే నిర్లక్ష్యం వహిస్తూ సర్పంచ్‌లను అప్పుల పాలు చేస్తున్న వైనం మండలంలో చోటు చేసుకుంటుంది.



జాజాల గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి

# కార్యకర్తల అండతోనే కాంగ్రెస్ బలోపేతం..

**మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎంపిక:మాజీ మంత్రి చిన్నారెడ్డి**

**ఖిల్లాఘణపురం,జనవరి 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్‌హాల్ హాత్‌సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అండగా నిలుస్తున్నారని అన్నారు. భారత్ జోడోయాత్ర దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా దేశ ప్రజలు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. పెద్దఎత్తున రాహుల్ గాంధీ కి అనునిత్యం అడుగులో అడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర పేరుతో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాత్రకు జిల్లా మండల, గ్రామ స్థాయిల నుండి ప్రజల మద్దతును కూడగట్టే విధంగా కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త చేతిలో చేయి అడుగులో అడుగు వేసి రేవంత్ రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ – మిగతా2లో..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి డా.చిన్నారెడ్డి

# గెలుపోటములు సమానంగా స్వీకరించాలి..

- సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్
- టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్, జనవరి 13 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఎమ్మెల్యే క్రికెట్ టోర్నమెంట్‌ను ఆడారు. అనంతరం ఎమ్మెల్యేను క్రీడాకారులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడాకారులకు అన్ని రకాలకు సంబంధించిన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి యువకుడు విద్యతోపాటు క్రీడారంగాల్లో కూడా నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. క్రికెట్, కబడ్డిలో గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి – మిగతా2లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

# కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి:కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**వనపర్తి ప్రతినిధి,జనవరి 13 ప్రభాతవార్త:** ఈనెల 18వ తేదీ నుండి 100రోజుల పాటు నిర్వహించనున్న రెండ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ భాష సంబందిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో కంటి వెలుగు కార్యక్రమంపై ఆమె జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆత్యంత ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం అమలు చేస్తుందని, స్థానిక సంస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. జిల్లా లో కంటి వెలుగు కార్యక్రమానికి 28 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఉదయం 9గంటల నుండి సాయంత్ర 4గంటల వరకు నిర్వహించాలని ఆమె తెలిపారు. 255 గ్రామపంచాయితీలలో, ఐదు మున్సిపాలిటీలలో 80 మున్సిపాలిటీ వార్డులలో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాలలో 300మందికి, పట్టణ ప్రాంతాలలో 400మందికి కంటి పరీక్షలు – మిగతా2లో..



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## ధరణి సమస్యలను పరిష్కరించేందుకు తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలి..

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 13 ప్రభాతవార్త :** శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలులో టిఎం 33, జిఎల్‌ఎం మాడ్యుల్స్, కోర్టు కేసులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. మాడ్యుల్స్ టిఎం 33 ప్రకారం భూ సంబంధిత సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తిగా విచారించి పరిష్కరించాలన్నారు. భూములకు సంబంధించిన కోర్టు కేసుల పరిష్కారం పెండింగ్‌లో దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. కేసుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ఒక టీంలాగా పనిచేసి సత్ఫలితాలు పొందాలని అన్నారు. సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ నర్సింగ్‌రావు, పిఎస్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులందరిని ఈశ్రామ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

**గద్వాల జిల్లా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 13 ప్రభాతవార్త :** అసంఘటిత కార్మికులందరిని ఈ శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసి వారికి సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ హాలులో జిల్లా కార్మికశాఖ మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓలు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రభుత్వం సామాజిక భద్రత పథకం కింద అసంఘటిత కార్మికుల కోసం ఈశ్రామ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని, ఈశ్రామ్ పోర్టల్‌లో ఈఎస్ఐ సౌకర్యం లేని అసంఘటిత కార్మికులు ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో ఎలాంటి రుసుము లేకుండా కామన్ సర్వీసు సెంటర్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పనులు చేసేవారు, మత్స్యకారులు, వీధి వ్యాపారాలు చేసే వారంతా అసంఘటిత కార్మికుల జాబితాలోకి వస్తారని తెలిపారు. నమోదు చేసుకున్న తరువాత కార్డు తీసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినట్లయితే వారి కుటుంబం 2 లక్షల ఆర్థిక సహాయాన్ని పొందుతారని, పాక్షికంగా అంగవైకల్యం కలిగితే ఒక లక్ష ఆర్థిక సహాయాన్ని పొందుతారని తెలిపారు. ప్రతి మండలంలో కార్మికుల వివరాలు సేకరించి పోర్టల్‌లో నమోదు చేయించాలని తెలిపారు. వడ్డేపల్లి, అయిజ, గద్వాల మున్సిపాలిటీలలో ఈ పోర్టల్ కొరకు ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించి ప్రతి కార్మికుడిని ఈశ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసి, కార్మికుల పూర్తి వివరాలు పొందుపరిచేలా చూడాలని మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. ఎన్ఆర్‌జిఎస్ వర్కర్‌లు, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌సి, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడిలు, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యా వాలంటీర్లందరు ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఈశ్రామ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సహాయ కార్మికశాఖ అధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులందరు కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను పొందేందుకు ఈశ్రామ్ పోర్టల్‌లో ప్రతి కార్మికుడు నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లాకు 2,16,500లు లక్ష్యంగా ఉండగా 96,500ల ఈశ్రామ్ పోర్టల్‌లో నమోదు చేశామని, మిగిలిపోయిన వారిని కూడా రిజిస్టర్ అయ్యేలా చూస్తామని తెలిపారు. సమావేశంలో కార్మికశాఖ అధికారి మహేష్‌కుమార్, జడ్పీ సీఈఓ విజయనాయక్, మహిళా శిశు సంక్షేమ అధికారి ముసాయిదాబేగం, మున్సిపల్ కమిషనర్ నర్సింహులు, కామన్ సర్వీసు సెంటర్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, అన్నిమండలాల ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.



ఈ శ్రామ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## ఘనంగా జంగిల్ సాబ్ ఉర్సు ఉత్సవాలు..

**పాల్గొన్న గొంగళ్ల రంజిత్‌కుమార్**



**ధరూర్, జనవరి 13 ప్రభాతవార్త :** మండలంలోని నీలహళ్లి గ్రామంలో జంగిల్‌సాబ్ ఉర్సు ఉత్సవాల సందర్భంగా జంగిల్‌సాబ్ తాత దర్గాను నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మునెప్ప, రాము, జగదీష్, హనుమంతు, తిప్పన్న, చంద్రశేఖర్, నరసింహులు, విజేంద్ర తదితరులు గొంగళ్ల రంజిత్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, నాయకులు పరశురాముడు, రంగస్వామి, వెంకటేష్, రామాంజనేయులు, శివన్న, ఆంజనేయులు, మహానంది, సుదర్శన్‌లతో పాటు మల్దకల్ మండల అధ్యక్షుడు, కార్యదర్శి తిమ్మప్ప, లక్ష్మన్న, గోపాల్, భూపతినాయుడు, కెటిదొడ్డి మండల నాయకులు అంజి, భీమన్ గౌడ్, ఏసు, ఉపేంద్ర, దొడ్డన్న, అంజి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్‌రావు ధాక్రేను కలసిన కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్



**దేవరకద్ర, జనవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి మొదటిసారి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ధాక్రేను దేవరకద్రకు చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయనకు మర్యాదపూర్వకంగా కలిసి ప్రదీప్‌గౌడ్ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్‌ను మాణిక్‌రావు ధాక్రేకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పరిచయం చేయించారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి పార్టీ అంతర్గత విషయాలపై ప్రదీప్‌గౌడ్ చర్చించారు.

## తెలంగాణలో మున్నూరు కాపులకు పెద్దపీట..

**మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య**



**జల్లాఘణపురం, జనవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మున్నూరు కాపు కులస్థులకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శిగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన శాంతి కుమారిని నియమించడం పట్ల సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయంగా నోచుకోని మున్నూరు కాపులకు స్వరాష్ట్ర సిద్దించాక 2014 తరువాత సీఎం కేసీఆర్ మున్నూరు కాపు సామాజిక కులానికి చెందిన జోగు రామన్నను మంత్రిగా బొంతు రామ్మోహన్‌ను హైదరాబాద్ నగరం మేయర్ కేశవరావు ను టీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీగా మున్నూరు కాపులకు రాజకీయంగా గుర్తింపునిచ్చారని అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తరువాత గంగుల కమలాకర్‌ను మంత్రిగా బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మెన్ గా గద్వాల విజయలక్ష్మీ ని హైదరాబద్ మేయర్‌గా వద్దిరాజు రావిచంద్రను రాజ్యసభ సభ్యుడిగా నియమించారని గుర్తు చేశారు. ఉత్తర తెలంగాణలో చాలామందిని ఎమ్మెల్యేలుగా, జడ్పీ చైర్మెన్లుగా నియమించి మున్నూరు కాపు కులస్తులకు అండగా నిలిచిన సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రాధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున మున్నూరు కాపులకు ఐదు ఎకరాల భూమిని కేటాయించి ఐదు కోట్ల రూపాయలతో భవనాన్ని నిర్మాణం చేస్తున్నారని అన్నారు. మున్నూరు కాపు కులస్తులను గుర్తించి అవకాశాలు కల్పిస్తున్న సీఎం కేసీఆర్ వెంటనే మున్నూరు కాపు కులస్థులు ఉంటారని అన్నారు. మున్నూరు కాపు కులస్తులను రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని తెలిపారు.

## సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన, అవయవదాన కార్యక్రమం

**అవయవదాన పత్రాన్ని అందజేసినతెలుగు తిరుమలేష్**



**అమరచింత, జనవరి 13 ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామివివేకానంద సేవా సమితి వారు నిర్వహించిన రక్తదాన, అవయవదాన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ జీవన్ దాన్ అవయవదానం కేంద్రం, నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్ వారికి తన మరణాంతరం శరీరంలోని అన్ని అవయవాలను రాతపూర్వకంగా దానం చేసిన అమరచింత పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు, రచయిత, రెడ్ క్రాస్ సభ్యులు డా.తెలుగు తిరుమలేష్ ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మెన్ డా. గూడూరు సతీమహాలక్ష్మీ కి తన అవయవదాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు తిరుమలేష్ చేస్తున్న సామాజిక దృక్పథానికి సావిత్రిబాయి పూలే ట్రస్ట్ నిర్వాహకులు తిరుమలేష్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లింగన్న, సంతోష, బాలు, రామకృష్ణ, మ్యాడమ్, శ్రీను, ఉదయ్, మల్లేష్, ప్రముఖ జానపద కళాకారుడు దేవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కబడ్డీ పోటీలు..



**జల్లాఘణపురం, జనవరి 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం యువజన దినోత్సవ వార్షికోత్సవం సందర్భంగా ప్రజభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలకు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధు మాట్లాడుతూ ఒక మంచి క్రీడాకారుడు ఆట మైదానంలో నుండి రానిస్తాడని ఆకాంక్షించారు. క్రీడలు ఆడటం వల్ల శారీరకంగా, మానసికంగా వికాసం మెరుగుపడటమే కాకుండా మంచి సృజనాత్మకతతో కూడిన వ్యక్తులుగా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాధ ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, వనపర్తి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గొడుగు సత్యం, ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ బద్రునాయక్, లెక్చరర్‌లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కారానికి స్థంభాల ఏర్పాట్లు..



**జల్లాఘణపురం, జనవరి 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో విద్యుత్ అవసరాల నిమిత్తం 23విద్యుత్ స్థంభాలకు విద్యుత్ వైరును ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ క్యామ వెంకటరమణ తెలిపారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ స్థంభాలు లేక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సహకారంతో గ్రామంలోని విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించడానికి స్థంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా జల్లాగట్టుపై నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి స్థంభానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ స్థంభాల ఏర్పాట్లలో గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ ధరలు

**రూ.7023 ధర పలికిన కింటాల్ కందులు**

**దేవరకద్ర, జనవరి 13 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 10 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ కందులకు అత్యధికంగా రూ.7023 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.6929 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి



**దేవరకద్ర, జనవరి 13 ప్రభాతవార్త:** ముది రాజ్‌లకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చే యాలని ప్రభుత్వానికి తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజమూరిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేవరకద్రలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అలాగే ముదిరాజ్‌లను బిసి డి గ్రూపు నుండి ఏ గ్రూపుకు మార్చాల ని కూడ ఆయన కోరారు. ముదిరాజ్‌లకు ఏక్యాగృహాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాకుండా 50 ఏళ్ల పైబడ్డ మత్స్యకారులందనికి ఫింఛన్లు మంజూరు చేయాలన్నారు. ముదిరాజ్‌ల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాజమూరిశ్రీనివాస్ కోరారు.

# నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే విఫలం..

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్.. 2వ రోజుకు చేరిన రాచాల ఆమరణ నిరాహార దీక్ష..**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 13 ప్రభాతవార్త:** కానాయపల్లి శంకరం సముద్రం నిర్వాసితుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో జిల్లా కు చెందిన వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, దేవకద్ర ఎమ్మెల్యే ఆలవెంటేశ్వర్ రెడ్డి విఫలమయ్యారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలో బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష 2వ రోజుకు చేరింది. ఈ దీక్ష శిబిరానికి హాజరైన ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి జిల్లాలో రైతలను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కి ప్రజా సమస్యలపై కనీస సోయి లేకుండా వ్యవహరిస్తు 9ఏళ్లగా నిర్వసితుల సమస్యలను పరిష్కరించకుండా రైతులను తీవ్ర క్షభ పెడుతున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టుల మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదని త్వరలోనే ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు ఆదారాలతో బయటపెడతామని అన్నారు. రెండు రోజులుగా దీక్ష చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని, రాచాల ఆరోగ్యానికి ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీపీఎం కార్యదర్శి జబ్బార్ మాట్లాడుతూ కానాయపల్లి గ్రామంలో ప్రస్తుతం 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ప్లాట్లు, ఆర్ అండ్ ఆర్ బెనిఫిట్స్ ఇచ్చి అంతేకాక సీ ఫామ్ డబ్బులు అందరికి ఒకే విధంగా జమ చేయాలని డమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సత్యం సాగర్ మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన సోషియో ఎకానామిక్ సర్వేలో గ్రామానికి చెందిన చాలా మంది లబ్దిదారులు మిస్సయ్యారని వారిక లబ్ది చేకూరేలా చూడాలని పునరావాస కేంద్రంలో ప్లాట్ల కోసం చూపబడిన భూమి ఎత్తు తగ్గులతో ఇండ్ల నిర్మాణాలకు అనుకూలగంత లేదు కావున ఆ భూమిని చదును చేసి ఇవ్వాలని అన్నారు. టీడీపీ నాయకులు కిషన్ మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు నరోత్తమ్‌రెడ్డి, బాజ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ నిర్వాసితుల పేరు మీద మధ్యవర్తులు తప్ప ఎవరు బాగుపడలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. అనంతయం వైద్యులు రాచాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలో పొలిటికల్ జేఏసీ నాయకులు అంజన్న యాదవ్, మహీందర్ నాయుడు, శేఖర్ గౌడ్, స్వామి నాయుడు, భరత్ కుమార్, తిరుపతయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్, బోయేజ్ గొల్లబాబు, శేఖర్ రెడ్డి, సీఐటీయు నిక్సన్, బీఎస్పీ నాయకులు మాసన్న తదితరులు పాల్గొన్నారు.



రాచాల కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



రాచాల యుగంధర్ రెడ్డి ఆమరణ దీక్షకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్

## ముమ్మరంగా చిన్నరాజమూర్ గర్భాలయనిర్మాణ పనులు..

**- రూ.34 లక్షల వ్యయంతో పనులు - కృష్ణశిలతో గర్భాలయనిర్మాణం**

**- ప్రస్తుతం బాలాలయంలో స్వామివారి తాత్కాలిక దర్శనం**

**దేవరకద్ర, జనవరి 13 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రధాన దేవాలయాలలోని ఒకటైన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం గర్భాలయ నిర్మాణ పనులు గత కొన్ని రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.34 లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. దేవస్థానానికి సంబందించిన నిధులతో కూడ మరికొన్ని పనులు చేపట్టనున్నారు. ఈ గర్భగుడికి ఎన్నో ఏళ్ళ చరిత్ర ఉంది. ఈ గర్భగుడికి ఇప్పటికి పై కప్పు లేదు. ఇప్పుడు కూడ ఆచారం ప్రకారం నూతన గర్భాలయానికి పై కప్పు ఏర్పాటు చేయడంలేదు. దీనికి గాను హైద్రాబాద్‌లోని ఘట్‌కేసర్ వద్ద గర్భాలయనిర్మాణానికి సంబందించి కృష్ణశిలతో రాతి పనులు జరుగుతున్నాయి. గర్భాలయం ద్వారాలను టేకుతో ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానంలో 100 ఏళ్ళకు పైగా చరిత్రగల చింత చెట్టును అలాగే ఉంచుతున్నారు. ఈ చెట్టుకు 100 ఏళ్ళు ఉండటంతో గురుత్వాకర్షణ మహిమశక్తి ఉంటుండంతో చెట్టును అదే స్థానంలో అలాగే ఉంచుతున్నారు. ప్రస్తుతం ఉన్న గర్భాలయాన్ని తొలగించి కొత్త గర్భాలయ మరమ్మతు పనులు చేపడుతున్నారు. శాస్త్రోక్తంగా దేవస్థానం గర్భాలయనిర్మాణ పనులు చేపడుతున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకుడు రాఘవేంద్రాచారి తెలిపారు.



చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవస్థానం

**ప్రస్తుతం బాలాలయంలో స్వామివారి దర్శనం...**

ఆంజనేయస్వామి గర్భాలయనిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో స్వామి వారిని ప్రస్తుతం ఉన్న స్థలంలోనుండి తొలగించి దేవస్థానం ముందు కొత్తగా ఏర్పాటు చేసిన బాలాలయంలోకి స్వామివారిని తరలించారు. తాత్కాలికంగా ప్రస్తుతం స్వామివారు అక్కడనే భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవస్థానం గర్భాలయనిర్మాణ పనులు పూర్తయ్యేవరకు ఇక్కడే స్వామి వారికి పూజలు చేయనున్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం..

**ఎమ్మెల్యే సహకారంతో గ్రంథాలయంలో నూతనంగా పుస్తకాల ఏర్పాటు**

**ఉద్యోగార్థులకు మరింత సౌకర్యంగా గద్వాల టౌన్ గ్రంథలయం**

**గద్వాల టౌన్, జనవరి 13 ప్రభాతవార్త :** గద్వాల గ్రంథాలయాలు, ఆధునిక దేవాలయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గల గ్రంథాలయంలో కొత్తగా 400 ల వివిధ రకాల పుస్తకాలు సమకూర్చారు. ఈ సందర్భంగా జంబు రామన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం కెసిఆర్ నేతృత్వంలో ప్రభుత్వ వివిధ రకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చిన సందర్భంలో గ్రంథాలయంలో నూతనంగా వివిధరకాల పుస్తకాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని సూచించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం గ్రంథాలయంలో అవసరమైన మెటీరియల్ సైతం అందుబాటులో ఉందన్నారు. పాఠకులకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు పోటీ పరీక్షలకు సంసిద్ధం అయ్యేందుకు గద్వాల టౌన్ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిరుద్యోగులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్

## దేవరకద్రలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు

**దేవరకద్ర, జనవరి 13 ప్రభాతవార్త:** దేవరకద్రలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమపథకాలతో పొందుపరచిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులకు ఈ క్యాలెండర్లను అందజేశారు. స్థానిక యంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు మున్నూరుబాల్‌రాజ్, నాయకులు కొండశ్రీనివాస్‌రెడ్డి, కొండ భాస్కర్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, షరీఫ్, ఉప్పరిసత్యం, ఉమ్మిగారి వెంకటేశ్, రామకృష్ణ, కృష్ణారెడ్డి, మజహార్, శ్రీను, బీసు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్, భార్గవ చారిలతో పాటు ఆయా గ్రామాలకు చెందిన పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**ఆలతోనే అభివృద్ధిసాధ్యం: జెట్టినరసింహ్మారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్**

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోనే దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. దేవరకద్రలో శుక్రవారం క్యాలెండర్‌ను ఆవిష్కరణ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో ఎన్నడూ జరుగని అభివృద్ధిపనులు ఇప్పుడు జరిగాయన్నారు. రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందడంతో పాటు ప్రజల అన్ని మౌలికవసతులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుస్తుందన్నారు. ప్రజా సహకారం ఉన్నంతకాలం బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిపనులను చేస్తూనేఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర పాలనను వేరే రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొంటున్నాయన్నారు.

## జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా అహ్మదుల్లా ఖాన్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ వర్కింగ్ జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా అహ్మదుల్లా ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో కోఆపరేటివ్ శాఖకు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. 11 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా అధ్యక్షుడిగా మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ అహ్మదుల్లాఖాన్, ఉపాధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ ముచ్చర్ల దినకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.ఎస్.సురేష్, కోశాధికారిగా సి.సురేష్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ఎం.చంద్రశేఖర్‌రావు, తిప్పర్తివిజయ్‌కుమార్, పుట్టపాగ వెంకటస్వామి, కొండకింది మాధవరెడ్డి, హెచ్.ఉమాశంకర్, జి.సత్యనారాయణ, కొండికొండ మోహన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియలో సొసైటీ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు ఎండీ.అబ్దుల్లా ఖాన్, పరిపూర్ణం, విజయ్‌కుమార్, సాయిలుసాగర్, కందికొండ రమేష్‌లతో పాటు ఏటిగడ్డ వెంకటేష్, మహ్మద్ దర్వేష్, మహ్మద్ నజీర్ అహ్మద్‌లు ఉన్నారు. కోఆపరేటివ్ శాఖకు చెందిన జూనియర్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి ఉన్నారు. నూతన కార్యవర్గాన్ని కార్యవర్గ సభ్యులు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటో వీడియో జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి నూతన కార్యవర్గం తరుపున అధ్యక్షులు అహ్మదుల్లా ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత టీచర్ మల్లిఖార్జున్‌పై దాడి చేసిన మతోన్మాదులను శిక్షించాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లిఖార్జున్‌ను కులం పేరుతో దూషిస్తూ బలవంతంగా దేవుడు గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి అవమాన పరుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించి అనాగరిక చర్యలకు పాల్పడిన ఆర్ఎస్ఎస్ బీజేపీ మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని సీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులైన మల్లిఖార్జున్ టీచర్‌ను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దళిత గిరిజనుల హక్కులను కాపాడేందుకు సీటీయూ ఎల్లప్పుడు ముందుంటుందని, ఈ నెల 17న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పర్వతాలు, ఫయ్యుద్దీన్, రామయ్య, మల్లేష , పార్వతమ్మ, దశరథం, అశోక్ తదితరులు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

## నేడు గోదా రంగనాయకస్వామి కళ్యాణం



**బిజినేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆనందగిరి కొండపై వెలసిన గోదా సమేత లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాయకస్వామి కళ్యాణం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గం.లకు ప్రారంభమయ్యే కళ్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు. కళ్యాణానికి వచ్చే దంపతులు సాంప్రదాయ దుస్తులతో కళ్యాణంలో పాల్గొనాలని కోరారు.

## రూ.1లక్ష ఎల్ఓసీ అందజేత



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** తెల్కపల్లి మండలంలోని గడ్డంపల్లీ గ్రామానికి చెందిన రాము ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆర్థిక పరిస్థితులతో మెరుగైన వైద్య చికిత్స చేయించుకోవడానికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిని ఆశ్రయించడంతో స్పందించిన ఆయన బాధితుడికి రూ.1లక్ష ఎల్ఓసీ చెక్కును అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తల అండతోనే కాంగ్రెస్ బలోపేతం..

**మొదటి పేజీ తరువాయి భాగం...**

ముఖ్య నాయకులకు పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సైనికులలా పని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పై చాలా నమ్మకం ఉందని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జల్లాఘణపురం నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవిజ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య యాదవ్, బీసీ సెల్ కమిటీ అధ్యక్షులు వెంకటరాములు, రైతు కమిటీ అధ్యక్షులు బాల్ రెడ్డి, మహిళాకమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రాసద్ యాదవ్. జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షులు గంజాయి రమేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోట్ల రవి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం.దేవన్న యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దివాకర్ యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు రోహిత్ రెడ్డి, పెద్దమందడి అధ్యక్షుడు పెంటయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి:కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**మొదటి పేజీ తరువాయి భాగం...**

నిర్వహించాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బందికి 24,537 రీడింగ్ అద్దాలను, 42 ట్యాబులను అందించడం జరిగిందని, 28 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె తెలిపారు. ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, డీఎంహెచ్ఓ డా.రవిశంకర్, ఏఓసాయినాథ్, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓ లు, మండల ప్రత్యేక అధికారులు, పీఓలు, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏంపీలు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి..

**మొదటి పేజీ తరువాయి భాగం...**



క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రతిఒక్క క్రీడాకారులు సోదరభావంతో కలిసి మెలిసి క్రీడలను ప్రదర్శించాలన్నారు. క్రీడా ప్రాంగణానికి అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపపి రాజారెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపిపి వీరన్న, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షు డు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ విష్ణు, గ్రామసర్పంచ్ ఆంజనేయులు, గ్రామాల సర్పంచ్‌లు ప్రతాప్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామచంద్రరెడ్డి, అజయ్, చంద్రశేఖర్‌రెడ్డి, మధునాయకి, ఎల్లప్ప, నారాయణ, ఆంజనేయులు, మండల యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మించండి

◆ అలంపూర్ ఎమ్మెల్యే డా.వీఎం అబ్రహాం


డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అబ్రహాం

**అలంపూర్,జనవరి 13 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని రాష్ట్ర విపత్తు నిర్వ హణ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి ఐపిఎస్‌ను కలిసి నూతన అగ్నిమాపక కేంద్రాన్ని (ఆల్రెడి మంజూరైన అగ్నిమాపక కేంద్రాన్ని) త్వరగా పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన డిజి త్వరలో మొదలుపెడతామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఆర్డీఎస్ చైర్మన్ సీతారాంరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు డా.వి.ఎం అజయ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను జోగులాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్సీ కవితను జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

**ఇటిక్యాల,జనవరి 13 ప్రభాతవార్త:** ఈనెల 22 నుండి 26వ తేదీ వరకు జరిగే జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంతో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, బారాసా పార్టీ రాష్ట్ర యువ నాయకులు డా. అజయ్, ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ తనగల సీతారాంరెడ్డి,ఎమ్మెల్సీ కవితను కలిసి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.ఇదే సందర్భంలో అలంపూర్ నియో జకవర్గ రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే అబ్రహాంతో ఎమ్మెల్సీ కవిత చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్




**వనపర్తి టౌన్,జనవరి 13 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ జన్మదినాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మున్సిపల్ కమీషనర్, ఏఈడీ లు, మున్సిపల్ సిబ్బంది ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం తెలంగాణ పంచాయితీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం వనపర్తి జిల్లా శాఖ తరుపున సీఈఓ వెంకట్ రెడ్డి, ఉప సీఈఓ రామ్ మహేశ్వర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే పంచాయితీరాజ్ వ్యవస్థలో వనపర్తి జిల్లా నెంబర్ వన్ స్థానంలో ఉందని ఇదే కృషితో అధికారులు పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోగట్టుమీది భానుప్రసాద్, అధ్యక్షులు సయ్యద్ రషీద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్, విశ్వేశ్వర్ రెడ్డి, సుజాత, గురు రాఘవాచారి, శ్రీనివాసారావ్, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



**వనపర్తి టౌన్,జనవరి 13 ప్రభాతవార్త:** ఎన్‌టీఆర్ వర్ధంతి ఈనెల 18న ఘనంగా నిర్వహించాలని టీడీపీ నాయకులు బి.రాములు, వెంకటయ్య యాదవ్, నందిమల్ల అశోక్ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సామాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో సంక్షేమ పథకాలు రూ.2 కిలో బియ్యం, వృద్ధాప్య పెన్షన్లు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రైతులకు ఉచిత కరెంటు, జనతా వస్త్రాలు, పక్కా గృహాలు, మండల వ్యవస్థ తదితర పథకాలను చేపట్టిన మహనీయుడు ఎన్‌టీఆర్ అని అన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అవసరం ఉందని అన్నారు. కార్యకర్తలు, నాయకులు కసితో పని చేసి పార్టీ అభివృద్ధికి తోడుపడాలని అన్నారు. సమావేశంలో నందిమల్ల రమేష్, ఆవులశ్రీను,చిన్నయ్య యాదవ్,చిట్యాల బాలరాజు, బాలు నాయుడు, ఖాదర్, కొత్త గొల్ల శంకర్ పాల్గొన్నారు.

## ఎస్టీ సెల్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆల

**కొత్తకోట,జనవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణ ఎస్టీ సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకలి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అందుకు ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకల కుల సంఘం ఉపాధ్యక్షులు లాల్‌కోట శ్రీనివాసులు, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవరెడ్డి, వనపర్తిజిల్లా ఎస్టీ సంఘం ఉపాధ్యక్షులు బాలకృష్ణ,పట్టణ ఎస్టీసెల్ ఉపాధ్యక్షులురామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**అచ్చంపేట, జనవరి13, ప్రభాతవార్త:** అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన మంతటి కాంతయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న అచ్చంపేట బీజేపీ నాయకులు శ్రీకాంత్‌భీమా గ్రామానికి చేరుకొని కాంతయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి బీజేపీ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఆయన వెంట సురేష్, నాసరయ్య, శ్రీధర్, అంబేద్కర్ సేవా రాష్ట్ర అధ్యక్షులు సహదేవ్, శేఖర్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

# నేడే ఖిల్లా గట్టు వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కాకతీయుల కాలం నుండి పూజలు అందుకుంటున్న స్వయంభు ఖిల్లాగట్టు వీరాంజనేయ స్వామి మూలవిరాట్, శిలాల గట్టుపై వీరాంజనేయస్వామి దేవాలయం

**ఖిల్లాఘణపురం,జనవరి 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఖిల్లా గట్టుపై స్వయంభుగా వెలసిన వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నేటి నుండి 3రోజుల పాటు అట్టహాసంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. చిల్లగట్టు ప్రథమ ద్వారం వద్ద బలిసిన శ్రీవీరాంజనేయ స్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం ఆంజనేయ స్వామికి సుప్రభాత సేవ పంచామృతాభిషేకం స్వామి వారికి అష్టోత్తర శతమావళి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఆంజనేయ స్వామి దీక్ష మాలాశారణ చేసిన స్వాములచే స్వామి వారి పాదుకలు ఊరేగింపుగా ఖిల్లా గట్టు స్వామి సన్నిధానికి చేర్చడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వహకులు పేర్కొన్నారు. స్వామి వారికి కర్పూర నీరాజనం చేస్తూ పరిసర గ్రామాల భక్తులచే భజనలు పురాణ కాలక్షేపాలు జరుగుతాయని ఆలయ కమఇటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాయంత్రం మకర సంక్రాంతి దివ్య జ్యోతి వెలిగిస్తారని తెలిపారు. ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం వీరాంజనేయ స్వామికి సహస్రనామార్చన తమలపాకుల పుష్పాలతో ప్రత్యేక పూజలు జరపబడును భక్తుల ప్రత్యేక పూజలు అనంతరం పెద్ద మంగళహారతి కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఆదివారం స్వామి వారిని దర్శించడానికి మండల పరిధిలోని గ్రామాల నుండి వందలాది మంది భక్తులు ఖిల్లా గట్టు వీరాంజనేయ స్వామి సన్నిధానానికి చేరుకుంటారని పేర్కొన్నారు. చివరగా సోమవారం స్వామి వారికి అభిషేక కార్యక్రమాలతో పాటు స్వామి వారి జలకేళి తిప్పోత్సవం కార్యక్రమాలతో రథోత్సవం నిర్వహించి బ్రహ్మోత్సవాల ముగింపు దశకు చేరుకుంటాయని అన్నారు. రథోత్సవం కిల్లా గట్టు వీరాంజనేయ స్వామి ఆలయం నుండి బజారు ఆంజనేయ స్వామి దేవాలయం వరకు నిర్వహిస్తామని అన్నారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని దైవ కృకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్త పట్టాభిరాములు పురోహితులు జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. సంక్రాంతి పండుగ పర్వదిన రోజు ఖిల్లా గట్టుపై భక్తుల కోలాహలం అధికంగా ఉంటుంది. 3రోజుల పాటు ఖిల్లా గట్టుపై బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయం పైకి వెళ్లడానికి రహదారి మార్గాన్ని భక్తులు మరమ్మత్తులు చేస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు, ప్రాచీన కట్టడమైన ఖిల్లా గట్టు అందాలను వీక్షించడానికి రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# రంగస్వామి స్మారక జిల్లా స్థాయి చదరంగ పోటీలు ప్రారంభం


విద్యార్థులతో కలిసి చదరంగం ఆడుతున్న మున్సిపల్ చైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,జనవరి13 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా చదరంగ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రంగస్వామి స్మారక చదరంగం పోటీలను సిల్వర్ జూబ్లీ క్లబ్ లో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. పోటీలను వనపర్తి మున్సిపల్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. 13, 14 తేదీల్లో జరిగే ఈ పోటీలలో సీనియర్, జూనియర్స్ మొత్తం 80 జట్లు పాల్గొనున్నాయి. సీనియర్స్ మొదటి 3 స్థానాల్లో నిలిచినటువంటిజట్టుకు 5తులాలు, రెండు తులాలు, వెండి నాణాలను బహుకరించడం జరుగుతుంది.జూనియర్స్ కు 3తులాలు, రెండు తులాలు, వెండి తులం చొప్పున బహుకరించడం జరుగుతుంది. ఈ సందర్భాన్ని ఉద్దేశించి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులందరు తప్పనిసరిగా ఈ క్రీడను నేర్చుకోవాల్సిందిగా కోరారు. దీని ద్వారా విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మేధోశక్తి ఆలోచన విధానం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ క్లబ్ నెంబర్ ఆవుల రమేష్, జనరల్ సెక్రటరీ యాదగిరి, ట్రెజరర్ మెగా రెడ్డి, పోటీల కన్వీనర్ టీవీ కృష్ణయ్య, కృషి చేసిన రంగస్వామి మిత్రులు సత్యనారాయణ, రాంప్రసాద్, రంగస్వామి సోదరులు నరసింహ, గణేష్, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షులు మైపాల్‌రెడ్డి. జీహెచ్‌ఎం చంద్రశేఖర్, మద్దిలేటి, శ్రీనివాసులు, బుచ్చిబాబు, కవిగౌడ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను జిల్లా స్థాయి చెస్‌పోటీలనునిర్వహించిన అసోసియేషన్ సభ్యులను నిర్వాహకులను వనపర్తి మున్సిపల్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ అభినందించారు.

# మన్యంకొండలో ఘనంగా ధనుర్మాసపూజలు


మన్యంకొండలో పాశురాలను పఠిస్తున్న పురోహితులు

**దేవరకద్ర,జనవరి 13 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్రమాసం ధనుర్మాసపూజలు శుక్రవారం తెల్లవారుజామున కూడ కొనసాగాయి. ప్రతి ఏడాది దేవస్థానంలో ధనుర్మాసంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ సాంప్రదాయరీతిలో గత నెల 17న దేవస్థానంలో ధనుర్మాసపూజలు ప్రారంభమయ్యాయి. ఈ నెల14న దేవస్థానంలో ధనుర్మాసపూజలు పరిసమాప్తం కానున్నాయి. పవిత్ర ధనుర్మాసం సందర్భంగా దేవస్థానంలో ప్రతి రోజు తెల్లవారుజామున పురోహితులు గోదాదేవి ఆలపించిన పాశురాలను (తిరుప్పావై శ్లోకాలను) పఠిస్తున్నారు. ఈ విధంగా నెల రోజుల పాటు ప్రతి రోజు ఒక పాశురం చొప్పున స్వామి వారి గర్భగుడిలో బ్రహ్మము హూర్తంలో పురోహితులు పఠిస్తున్నారు. ద్రావిడ భాషలో ఈ పాశురాలను పఠిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్‌గౌడ్,శ్రీకాంత్,నారాయణరెడ్డి,పురోహితులు పాల్గొంటున్నారు.

# గ్రామీణ కళాకారులకు ప్రోత్సాహం అందించాలి

- జెడ్పీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్


మాట్లాడుతున్న జెడ్పీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్

**అచ్చంపేట, జనవరి 13, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత కళాకారులకు ప్రోత్సాహకం అందించి మరుగున పడ్డ కళలను వెలికి తీయాలని జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని రావిచేడు గ్రామంలో నిర్వహించిన చిడుతల రామయణం ప్రదర్శన కార్యక్రమానికి జెడ్పీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ నుంచి ప్రాచీన కళలను, కళాకారులను ప్రోత్సహిస్తే అనాటి నైపుణ్యాలను నేటి సమాజానికి గుర్తు చేసే విధంగా అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ కళాకారులకు రూ.10వేల ప్రోత్సాహకం అందించారు. ఆయన వెంట కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు నిరంజన్,బాల్‌లింగం,అశోక్‌గౌడ్, మల్లేష్,వెంకటేష్, నిరం జన్, నర్సన్న,ఆనంద్, కళాకారులుశ్రీనివాస్, వెంకటయ్య, కృష్ణయ్య, రాజేందర్, గోపాల్, భీమయ్య తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కెటిదొడ్డి,జనవరి 13 ప్రభాతవార్త:** కెటిదొడ్డి మండల పరిధిలోని రాయచూరు జిల్లా బూడిదపాడు గ్రామం వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణ రాష్ట్రంలో కెటిదొడ్డి మండల పరిధిలో రాత్రి సమయంలో పాతపాలెం గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారంతో రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టంను పోలీస్ స్టేషన్‌కు తరలించనట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ కొండాపురం పవన్‌కుమార్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో కెటిదొడ్డి మండల ఎస్సై వి.వెంకటేష్ పోలీసులు జ్యోతికాంత్, రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## చెంచులకు రాజశ్రీ కోళ్ల పంపిణీ

**అచ్చంపేట, జనవరి 13, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గంలోని అప్పాపూర్ పెంట గ్రామ పంచాయతీ పరిధిలోని పీర్లపెంట, తంగిడిగుండాల పెంట, మేడి మల్కాల, పుల్లాయపల్లి, అప్పాపూర్, భైరాపూర్ పెంటలలోని చెంచు కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆదేశానుసారం రెడ్‌క్రాస్ సోసైటీ సహకారంతో రాజశ్రీ కోళ్లను రెడ్‌క్రాస్ సోసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రటరి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆదేశాలమేరకు జిల్లాలో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్, చైర్మన్ సుధాకర్‌లాల్‌ల సూచనల మేరకు అప్పాపూర్ పెంట పరిధిలోని చెంచు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 10 కోళ్లను 2500 కోడి పిల్లలను పంపిణీ చేయడమైందని ఆయన తెలిపారు. చెంచులు రాజశ్రీ కోళ్ల పెంపకం ద్వారా పౌష్టికాహారం, ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు.కార్యక్రమంలో అప్పాపూర్ పెంట సర్పంచ్ బాలగుర్వయ్య,రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కృష్ణారావు తదితరులు ఉన్నారు.



## రెండవ రోజు సింగిరెడ్డి తారకమ్మ స్మారక జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్


సదఫ్ ఖాన్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫి ని అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి

**వనపర్తి టౌన్,జనవరి 13 ప్రభాతవార్త:** సింగిరెడ్డి తారకమ్మ జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు ముగిసాయి. మొదటి మ్యాచ్ షా లెవెన్ వర్సెస్ యాభ లెవెల్ మొదటగా బ్యాంటిగ్ ఎంచుకున్న యాభ లెవెన్ 15 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేయడం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో షా లెవెన్ 11.2 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 104 పరుగులు చేయడం జరిగింది. ఆర్‌సీసీ క్రికెట్ క్లబ్ వర్సెస్ లెవెల్ క్లబ్ మొదటగా బ్యాటింగ్ ఎంచుకున్న ఆర్సీసీ క్రికెట్ క్లబ్ 15 ఓవర్లలో ఐదువికెట్ల నష్టానికి 211 పరుగులుచేయడం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో లెవలప్ క్రికెంట్ క్లబ్ 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేయడం జరిగింది. మహబూబ్‌నగర్ వర్సెస్ ముంబై టీం మొదటగా బ్యాటింగ్ ఎంచుకొని మహబూబ్‌నగర్ 15 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 139 పరుగులు చేయడం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో ముంబై బ్యాటింగ్ చేయగా నాలుగు వికెట్ల నష్టానికి 142 పరుగులు చేయడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మాజీ చైర్మెన్ మార్కెట్ యార్డ్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ బండారి కృష్ణ, పాకనాటి కృష్ణ, ఆర్గనైజర్స్ పుట్టపాక మహేష్, సూర్యవంశం గిరి, హేమంత్, ముదిరాజ్, జీవి ప్రవాంత్, సురేష్, మాధవరావు, సునీల్ వాల్మీకి పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**మూసాపేట,జనవరి13 ప్రభాతవార్త:** మండల కేంద్రాలకు చెందిన ఎన్.తిరుపతి గౌడ్ గత కొన్ని రోజుల క్రితం కంటికి శస్త్ర చికిత్స చేసుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం దేవకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్ర మంలో గూపని కొండయ్య,కె.శ్రీనివాస్ సాగర్,కొత్త ఉప్పరి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**శ్రీరంగాపురం,జనవరి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగరాల గ్రామానికి చెందిన వెంకటయ్య, గట్టయ్యలు కొంత కాలం కిందట నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించిన విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మండల జడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ వారి పార్థివదేహాలకు నివాళిఅర్పించివారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, నాగరాల సర్పంచ్ నిర్మలరాధాకృష్ణ, మండలనాయకులు రాములు యాదవ్, చందు, చంద్రశేఖర్, నరేష్, ఆంజనేయులు, నరసింమ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సస్పెన్షన్ వ్యాఖ్యలు చెంపపెట్టు

● సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు



**వనపర్తి టౌన్,జనవరి13 ప్రభాతవార్త:** జీవో నెంబర్ 1 అప్రజాస్వామి కమని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో వేసిన పిటీషన్ పై జీఓను తాత్కాలికంగా సస్పెండ్ చేయడం, దానిపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెంపపెట్టు అని సీపీఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు సభలు, ర్యాలీలతో ప్రజలకు చేరువ కాకుండా నిరోధించే కుట్రను విమర్శించారు. హైకోర్టు ప్రజాస్వామ్యాన్ని రక్షింస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. రాజ్యాంగాన్ని కాపాడే సుప్రీం కోర్టు, కొలీజియం సిఫారసులను బీజేపీ ప్రభుత్వం తొక్కి పెట్టి వేధిస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగబద్ద పదవిలో ఉన్న ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్కర్ న్యాయవ్యవస్థపై తీవ్ర వ్యాఖ్యలతో దాడి చేయడం తగదని అన్నారు. న్యాయవ్యస్థను కూడా లొంగదీసుకోవాలనే బీజేపీ దుర్మార్గపు ఆలోచన సరికాదని అన్నారు.

## సీఐటీయు క్యాలెండర్ ఆవిష్కరణ



**పెబ్బేరు,జనవరి13 ప్రభాతవార్త:** సీఐటీయు నూతన సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీసాయి ఆవిష్కరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికుల సమక్షంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కరెస్వామి, కమీషనర్ జాన్ కృపాకర్, 3వ వార్డు కౌన్సిలర్ పార్వతి మహేందర్ గౌడ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమ మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు గంధం రాముడు, ఉపాధ్యాక్షులు సిద్ది రంజిత్ కుమార్, జయశ్రీ, ప్రధాన కార్యదర్శి గంగన్న, కోశాధికారి ఆయూబ్, బాలు, సీఐటీయు నేతలు, ఎం.రాజు,బాలయ్య,ఖాజా, మున్సిపల్‌కార్మికులుతదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లాకు భారీగా తరలి వెళ్లిన టీఎస్ యుటీఎఫ్ కార్యకర్తలు



**వనపర్తి టౌన్,జనవరి 13 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరుగుతున్న టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ఐదవ మహాసభలకు వనపర్తి జిల్లా నుండి ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లారు.సీనియర్ నాయకులు ఎస్.వెంకటయ్య జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఒక బస్‌తో పాటు, తుఫాను, ఏడుకారులో బయలుదేరినట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యారంగంలో వస్తున్న మార్పులను ప్రభుత్వ పాఠశాలలబలోపేతానికి మహాసభలో చర్చించుకున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎండి హమీద్,జ్యోతి,అరుణ,వెంకటమ్మ, పి.శ్రీనివాస్‌గౌడ్, తిమ్మప్ప,నరేందర్, బి.వెంకటేష్, నరసింహ, పి.శ్రీనివాసులు, రామన్‌గౌడ్, కురుమన్న తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**శ్రీరంగాపురం,జనవరి 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని కంబలాపురం గ్రామంలో నూతన సంవత్సరం క్యాలెండర్ లు పంపిణీ చేయడం జరిగింది. సర్పంచ్ ఎద్దుల మంజులరాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. 7ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య ప్రజలకు బహిరంగంగా చెప్పాలని అన్నారు. అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల నియామకాలను చేపడతామని హామీ ఇచ్చి అధఙకారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తని బీజేపీ నాయకులకు నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. కొత్త ఉద్యోగాలను ఇవ్వకుండా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్న ఘన చరిత్ర బీజేపీ దేనని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట పరం చేస్తూ లక్షల మంది ఉద్యోగులను రోడ్డున పడేస్తున్న బీజేపీ నాయకులు పదే పదే ఉపాధి కల్పన గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేస్తూ సామాన్య ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల రాజకీయాలకు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగులు బలికావద్దని విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరంలో నిరుద్యోగ యువతకు వేల ఉద్యోగాల కోసం ప్రస్తుతంనోటిఫికేషన్ వెలువడ్డాయి.తెలంగాణలో ప్రస్తుతం కొలువుల జాతర మొదలైందని అన్నారు, మండల రైతు అనుబంధ అధ్యక్షులు బక్కయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి, మండల మీడియా సెల్ కన్వీనర్ మేకల రాజు కుమార్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,బాబురెడ్డి,వీరయ్య, లక్ష్మయ్య, భానుప్రకాష్ రెడ్డి, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పలక, బలపం పట్టాల్సిన చేతితో వెట్టిచాకిరి

**● ఆచరణకు నోచుకోని చట్టాలు, నామమాత్రపు దాడులతో సరిపెట్టుకుంటున్న అధికారులు**

**ధరూర్, జనవరి 13 ప్రభాతవార్త:** మండలంలోని నెట్టెంపాడు గ్రామం లోని పెద్ద మొత్తంలో బాల కార్మికు లను పంట పొలాలకు తరలిస్తు న్నారు. బడిబాట పట్టాల్సి న బాలల ను పొలంబాట పట్టిస్తున్నారు. దీంతో చట్టాలు ఆచరణకు నోచుకో వడం లేదనే విషయం తెలిసిపోతుంది. వరుసగా సంక్రాంతి పండగ సెలవులు రావడంతో కూలీపని చేయించుకోవడానికి చిన్నారులను వాడుకుంటున్నారు.



కూలీ పనులు చేస్తున్న విద్యార్థినిలు

## కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త :** ఈనెల 18 నుండి నిర్వహించనున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, వైద్యాదికారులను ఆదే శించారు. శుక్రవారం ఆమె కంటి వెలుగు నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులు, మున్సిపల్ కమిష నర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో ఫోన్ కాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాల వారిగా కంటి వెలుగు శిబిరాల కేంద్రాల ఏర్పా టు, సౌకర్యాలు, సామాగ్రి, ట్రాన్స్‌పోర్టేషన్ తదితర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్ని కేంద్రా లలో నాణ్యమైన సౌకర్యాలు ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా కంటి వెలుగుకు సంబంధించి మెటీరియల్ రానట్లయితే తక్షణమే తెప్పించాలని ఆదేశిం చారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించే ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా మొబిలైజేషన్ ప్రణాళికను రూపొందించాలని, నాణ్యమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. అన్ని కేంద్రాలకు కంటి వెలుగు సామాగ్రి చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా మహబూబ్‌నగర్ జిల్లాలో కంటి వెలుగు నిర్వహణకు 45 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈకార్యక్రమాన్ని నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. కంటి వెలుగు కేంద్రానికి వచ్చే వారి వివరాలు అన్నింటిని ఆన్‌లైన్ డేటా చేసే వారి వివ రాలు అన్నింటిని ఆన్‌లైన్ డేటా చేసే నిమిత్తం బృందాలకు ట్యాబ్‌లు ఇవ్వడం జరిగిందని, ఎప్ప టికప్పుడు డేటాను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. అదేవిధంగా శిబిరాలకు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో పాటు ఫోన్ నంబర్‌ను తీసుకువచ్చే విధంగా విస్తృత ప్రచారం నిర్వహస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ ఫోన్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.



ఫోన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

## బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**ధరూర్, జనవరి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలో త్వరలో జరగబోయే పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈఓ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్య క్రమంలో వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్, గద్వాల, కెటిదొడ్డి మండలాలు, పార్టీ అధ్యక్షులు డిఆర్ విజయ్, రాముడు, ఉరుకుందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు, ప్రభాకర్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, రాఘవేంద్‌రెడ్డి, ఆలయ ఈఓ కవిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలుపొందిన జట్టుకు బహుమతుల ప్రదానం

**ధరూర్, జనవరి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నీలహళ్లి గ్రామంలో శ్రీ జంగిల్ సాబ్ ఉర్సు ఉత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గెలుపొందిన జట్టుకు ద్వితీ య బహుమతి నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధరూర్ మండల అధ్యక్షులు నెట్టెం పాడు గోవిందు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మునెప్ప, మండల కార్యదర్శి రాము, జగదీష్, విజయ్, చంద్రశేఖర్, కెటిదొడ్డి మండల నాయకులు అంజి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో పతంగుల పండగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 13 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 14న మధ్యాహ్నం 12 గం.లకు జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో పతంగుల పండగను నిర్వ హించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఒకప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి డా. శ్రీనివాస్‌గౌడ్ పతంగుల పండగ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ పతంగుల పండగ సంబరాల్లో భాగంగా హైదరాబాద్ నుండి ఆకర్షణీయమైన కలర్లతో వివిధ పెద్దవైన పతంగులను తెప్పించి ఎగురవేయడం జరుగు తుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రజలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా పిల్లలు గాలి పటాలను ఎగురవేసే సమయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకునేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. ప్రత్యేకించి అత్యంత పదునైన చైనా మాంజా వల్ల పిల్లలకు ప్రమాదం ఉన్న దృష్ట్యా చైనా మాంజా లాంటివి వాడవద్దని, సున్నిత దారాలు ఉన్న గాలి పటాలను వాడాలని ఆయన కోరారు.

## యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శికి ఘన సన్మానం

**వెల్దండ, జనవరి 13, ప్రభాతవార్త:** ఇటీవల యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పెద్దాపూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి శేఖర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్ర వారం మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సన్మా నించి అభినందించారు. ఈ సందర్భంగా మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా నిరంతరం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేస్తున్న తక్కళ్లపల్లి శేఖర్ కృషిని గుర్తించి యువజన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడం హర్షనీయమన్నారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, పుల్లయ్య, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఎర్ర శ్రీను, రమేష్, కొండలుతో పాటు తదితరులు ఉన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

**కల్వకుర్తి, జనవరి 13, ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే నిజమైన క్రీడాకారులుగా రాణించగలుగుతారని జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు స్నేహబంధాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సేవ్ ఇన్విరా న్మెంట్ పబ్లిక్ స్కూల్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ముఖ్య అతిథిగా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ ముఖ్య అతిథిగా హజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల వల్ల ఎక్కడో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి స్నేహబంధాలు ధృడంగా మారి ఎన్నో అవకాశాలు కలిసి వస్తాయని, వాటితో అభివృద్ధి చెందేందుకు కూడా ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ క్రీడలను పెంపొందించేందుకు అధికా రులు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ యువకు లకు ప్రోత్సాహం కల్పించి క్రీడలను మరుగున పడ కుండా అభివృద్ధి చేయాల్సి న బాధ్యత ఎంతైన ఉందన్నారు. అదే విధంగా కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో రామాంజనేయ యూత్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను తిలకించి జల్సా వర్సెస్ తర్నికల్ తండా మ్యాచ్‌కు టాస్ వేసిబాలాజీసింగ్ ప్రారంభించారు. కార్యక్ర మంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు, స్వేరో రామస్వామి, కంటోనిపల్లి సర్పంచ్ రామకృష్ణ, చెర్కూర్ సర్పంచ్, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కడం ఖాయం

**రాజాపూర్, జనవరి 13 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జనంపలిన దుశ్యంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తుల యాదయ్యగౌడ్ కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు ఆయనపేర్కొన్నారు. మున్ముందు జడ్చర్ల నియోజకర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరు ధ్‌రెడ్డి సమక్షంలో విస్తృతంగా గ్రామాల పర్యటన కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిగౌడ్, వెంకటేష్, శివ, వెంకి, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడలో జాతీయస్థాయిలో రాణించాలి

**లింగాల, జనవరి 13 ప్రభాతవార్త :** గ్రామీణ క్రీడా కడ్డికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం జరిగిందని, గ్రామీణ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు గ్రామీణ యువత కృషి చేయాలని టిడిపి అచ్చంపేట నియోజకవర్గ ఇంచార్జి డా. మోపతయ్య పేర్కొన్నారు. లింగాల మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో శుక్రవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మోపతయ్య మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని క్రీడల్లో రాణించే యువతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సి న అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా క్రీడలు, విద్యను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుం దని, ఇప్పటికైనా కెసిఆర్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని పేర్కొన్నారు. క్రీడల్లో అత్యం త ప్రతిభ కనబరిచి గెలుపొందే జట్టుకు తాను మొదటి బహుమతి ఇవ్వనున్నట్లు మోపతయ్య పేర్కొన్నారు. రెండవ బహుమతి ముదిరాజ్ సంఘంతాలూకా అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయ కులు మల్లేష్ ముదిరాజ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్య దర్శి రాజశేఖర్‌రావు, నాయకులు మల్లేష్, లింగస్వామి, శ్రీనివాస్ కబడ్డీ క్రీడలో జాతీయస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రావు, నాయకులు మల్లేష్, లింగస్వామి, శ్రీనివాస్, బాబు, నిరంజన్, శ్రీను, అశోక్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సాంకేతికతను అందిపుకుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలి

**● వేరుశనగ సాగులో అధిక దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా ఎదగాలి: దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి**

**అడ్డాకుల, జనవరి 13 ప్రభాతవార్త:** రైతులు వేరుశనగ సాగులో నూతన విధానాలను సాంకేతికతను అందిపుకుచ్చుకొని అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదగాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం అడ్డాకుల మండల పరిధిలోని తిమ్మాయిపల్లి తాండా దగ్గర గిరిజన ఉపప్రణాళిక పథకం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వేరుశనగ ఉత్పత్తికి సూచనలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ అవగా హన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగిచారు. రైతాంగాం పాత పద్ధతిలో మూస విధానంతో వ్యవసాయ సాగు పద్ధతిని విడనాడి టెక్నాలజీ ని అందిపుచుకుని అందుబాటులో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయ సహకారాలతో సాంకేతికతింగా వ్యవసాయ రంగం లో సాగుకు సిద్ధం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రూ.1కోటి తో నిర్మించే బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్య క్రమం అధికారులతో కలిసి సమీక్షించి ప్రజాప్రతినిధులు విధిగా కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కంటి వెలుగు వైద్య శిబిరాలకు తరలించి కంటి శుక్లాలు ఉన్న వారికి వైద్యం అందించాలని ఎమ్మెల్యే సూచించారు, కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున రెడ్డి, తహసీల్దార్ కిషన్ నాయక్, సింగిల్‌విండో అధ్యక్షులు జితేందర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయన్న గౌడ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వేరుశనగ అవగాహన సదస్సులో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

## ముదిరాజుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : దేవరకద్ర ఎమ్మెల్యే



ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి

**అడ్డాకుల, జనవరి 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ముదిరాజుల అభివృద్ధికి తెలంగాణ సర్కారు కట్టుబడి ఉందని వారి అభివృద్ధికి మత్స్యసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముదిరాజులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ముదిరాజులను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని దేవకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అడ్డాకుల మండలం గుడిబండ గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ దోనూరు నాగార్జున రెడ్డి లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జితేందర్ రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు పొన్నకల్ మహిమూద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఖాజా గోరి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు జయన్న గౌడ్, జాజల రాజేశ్వర్ రెడ్డి, గుడిబండ గ్రామ సర్పంచ్ భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మరింత మెరుగైన సేవలు అందించాలి

**● జిల్లా అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి13 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఐసియు, అత్యవసర విభాగంతో పాటు, మాతాశిశు సంరక్షణ విభాగం, జనరల్ ఓపి, డిస్పెన్సరీ ఎంసిహెచ్ డ్రగ్ స్టోర్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఓపిలో ప్రతి రోజు వస్తున్న రోగులు ఇన్ పేషెంట్స్‌తో పాటు, ఎంసిహెచ్ డ్రగ్ స్టోర్‌లో రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన ముఖాముచ మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లతో సమావేశమై ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలందించాలని, మందుల కోసం ఎవరు బయటకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. ఆసుపత్రి లో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బంది లేకుండా చూడాలని, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా. రాంకిషన్ ఇతర డాక్టర్లు ఉన్నారు.



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

**-స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తి: కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు**

**కల్వకుర్తి, జనవరి 13 ప్రభాతవార్త:** ప్రతి క్రీడాకారుడు ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని విజయ తీరాన్ని చేరుకోవాలని కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు, వెల్దండ తహసీల్దార్ చంద్రశేఖర్‌లు పేర్కొ న్నారు. వందేమాతరం షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వ హించిన షటిల్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ గిరిబాబు, వెల్దండ మండల తహసీల్దార్ చంద్రశేఖర్, వీఎఫ్ అసోసియేషన్ శశాంక్‌రెడ్డిలు హాజరై మొదటి బహుమతి గెలుపొందిన విజయ్, శ్రీనివాసులు, ద్వితీయ బహుమతి పొంది సాయిఫని, కాట్రావత్ రవిలతో పాటు బాబురావు, విజయ్, పోలీస్ మురళీ రవిలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల సోదరబావం, ఐక్యమత్యం పెంపొందుతాయన్నారు. స్వామి వివేకా నంద జీవితం యువతకు స్ఫూర్తి కావాలని వారు సూచించారు. నేటి యువత సమయాన్ని వృథా చేయకుండా ఖాళీ సమయాల్లో క్రీడల్లోతర్ఫీదు పొందాలన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో డీఎస్పీ గిరిబాబు, తహసీల్దార్ చంద్రశేఖర్‌లను శాలువాల తో సన్మానించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు రామకృష్ణ, అంజి, నాగేష్, మాసూమ్, కిశోర్, వెంకన్న, శివ, నర్సిం హ్మా, డాక్టర్ ప్రశాంత్ గౌతమ్, ప్రకాష్, చంద్రశేఖర్, శ్రీను తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

## ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేత

**గద్వాలటౌన్, జనవరి 13 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం శ్రీ కళ్యాణలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్బంగా నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. సంక్రాంతి పండగ సంద ర్భంగా నిర్వహించిన ముగ్గుట పోటీల్లో మహిళలు చేసిన ముగ్గు లను ఎమ్మెల్యే సతీమణి పరిశీలించి విజేతలను నిర్ణయించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతి చేతుల మీదుగా అందజేశారు. పాల్గొన్న ప్రతి మహిళకు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ అన్ని పండగలకు ప్రాధాన్యత ఇస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిం చడం జరుగుతుంది. ఈ సంక్రాంతి పండగ చిన్న పెద్ద మహిళ అనే తేడా లేకుండా సంక్రాంతి పండగలు అందరు కలిసి జరుపు కోవడం జరుగుతుంది. మహిళలు ఎంతో ఇష్టమైన ఈ పండగ సందర్భంగా మూడు రోజులపాటు మహిళలు ఇంటి దగ్గర ముగ్గు లను రంగు రంగుల ముగ్గులను వారిలో ఉన్న ప్రతిభను చూపిం చడం జరుగుతుందన్నారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేయడం జరుగుతుందనిచిన్న పిల్లలకు రేగిపళ్ల పోయడం జరుగు తుందన్నారు. మూడు రోజులు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండగ జరుపుకుంటారని అన్నారు. ఈ పండగ మూడు రోజులు జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని అన్నారు. అదేవిధంగా రైతులు కూడా ఈ పండగకుఎంతో మంచి ప్రాధాన్యత పశువులను పూజిం చి ప్రత్యేక అలంకారాలతో గ్రామాలలో ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు మధుమతి, దేవస్థానంకమిటి సభ్యులు, మరిడి శ్రీకాంత్, పత్తి శ్రీహ రి, సతీష్, రామ్మోహన్, సుదర్శన్, మహిళలుభక్తులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## చిన్ననాటి ఆటలు గుర్తుకొస్తున్నాయి

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**

**వెల్దండ, జనవరి 13 ప్రభాతవార్త:** తన చిన్న నాటి మిత్రులతో కలిసి ఆడిన ఆటలు గుర్తుకొస్తున్నాయని, అనాటి మధుర జ్ఞాపకా లు తన మదిలో ఎంతో పదిలంగా ఉన్నాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామంలో ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల కార్యక్రమానికి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వ కుర్తి నియోజకవర్గంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫౌండేషన్‌సహకారంతో క్రీడాపోటీలు కన్నుల పండువగా కొనసా గుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఉపాధితో పాటు యువతను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామస్తులు, క్రీడాకారులు రాఘవేందర్‌రె డ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, మల్లయ్య, చంద్రశేఖర్, రమేష్‌నాయక్, కొండలుయాదవ్, రమేష్‌గౌడ్, జగన్, తిరుపతయ్య, రాహుల్, మహేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు:** క్రీడా రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని, క్రీడల వల్ల శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జికూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం భైరాపూర్ గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ క్రీడా పోటీలను ఐక్యత ఫౌండేషన్ ఎగ్జికూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తగ్గిపోయిందని, శ్రమను పెంపొందించడంలో క్రీడలు ఎంతో తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో నిరంజన్, రామచంద్రయ్య, బాలకృష్ణ, కుమార్, అంకోజీ, ఫౌండేషన్ సభ్యులు కొండలుయాదవ్, జగన్, రాఘవేందర్, వెంకటయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన కేంద్ర మాజీ మంత్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 13, ప్రభాతవార్త:** మార్కండేయ ప్రాజెక్టు సందర్శనలో గాయపడిన కాంగ్రెస్ నాయకులు రాములు, వాల్యానాయక్‌లను కేంద్ర మాజీ మంత్రి బాల్‌రాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, రాష్ట్ర సెల్ అధ్యక్షులు జగన్‌లాల్‌లు శుక్ర వారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దాడి చేసి 6 రోజులు గడుస్తున్న నేటికి చర్యలు తీసుకోకపోవడంతో ఎస్పీ కె.మనోహర్‌ను డీసీసీ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ, మాజీ మంత్రి వర్యులు నాగంజనార్దన్‌రెడ్డిలతో కలిసిబాల్‌రాంనాయక్, రాములు నాయక్, జగన్‌లాలు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనం తరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత గిరిజన ఆత్మగౌరవ సభ బిజనపల్లి మండలంలో నిర్వహిస్తున్నామని, ఈ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు శంకర్ నాయక్, రఘునాయక్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## వాసవీ, వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**కల్వకుర్తి, జనవరి 13, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ, వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీ లు వాసవీక్లబ్ కేసీజీఎఫ్ వనితాక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు హజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. పోటీల్లో మొదటి బహుమతి కలిమిచెర్ల కావ్య, రెండో బహు మతి స్వాతి, మూడో బహుమతి ప్రజ్ఞలు గెలుపొందారు. కార్యక్ర మంలో రీజియన్ చైర్మన్‌ఇరువెంటి రమేష్, రీజియన్ సెక్రటరి జూలూరి సత్యానారాయణ, జోన్ చైర్మన్ పోల విజయ్‌కుమార్, జిల్లా అధికా రులు కలిమిచెర్ల గోపాల్, నీలలింగం, గుగ్గిళ్లశంకర్, మనోహర్, కొండూర్ కృష్ణయ్య, బాదం రాఘవేందర్, గుబ్బ కిషన్, గుండ్ల శ్రీను, రాఘవేం దర్, శోభన్‌బాబు, రాజేంద్రప్రసాద్, కల్వకుర్తి వాసవీక్లబ్ అధ్యక్షులు చిదెరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శి దుగ్గిఅశోక్, వనితాక్లబ్ అధ్యక్షురాలు చిదిరే శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కల్వ లక్ష్మి, ఆర్థిక కార్యదర్శి దుగ్గి ధనలక్ష్మి, వేపూర్ సర్పంచ్ కొండూర్ మాధవి, వాసవీ, వనితాక్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## వృద్ధులకు పండ్లు పంపిణీ

**కల్వకుర్తి, జనవరి 13, ప్రభాతవార్త:** ప్రపంచంలోని 250 దేశాల్లో లయన్స్‌క్లబ్‌ల ద్వారా ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసా గుతున్నాయని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్ అన్నారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాప కుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రజల భాగ స్వామ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్టీల్ ప్లేట్లు, గ్లాస్లులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రపంచంలోని 250 దేశాల్లో 28వేల లయన్స్ క్లబ్‌ల ద్వారా కోట్లాది మంది సామాన్యులకు సేవలు అందుతున్నాయ న్నారు. భారతదేశంలో 2వేల క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్న విషయాన్నిగుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా వటవృ క్షంలా విస్తరించి పేద ప్రజలకు సేవలు అందుతున్నాయని లయన్ కలిమిచెర్ల రమేష్ తెలిపారు. వృద్ధులకు సహకారాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు శ్రీధర్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, గుబ్బకిషన్, భాస్కర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య ఉన్నారు.

## ఏకశిలా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ద్వితీయ బహుమతి

**ఇటిక్యాల, జనవరి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల ఏకశిలా ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని వి రూప మట్టిని ఉపయోగించకుండా మొక్కలను పెంచుకోవడం సాధ్యమా అంటే సాంకేతికత వినియోగించుకుని అది సులభమేనని ఈ విద్యార్థి నిరూపించింది. పోషకాలతో కూడిన నీటిని వినియోగించి మట్టి లేకుండా కేవలం పైపుల్లో మొక్కలను పెంచవచ్చని నీరు వృధా కాకుండా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ఏర్పాటు చేసుకో వచ్చని పైపులకు రంధ్రాలు చేసి తగిన దూరంలో మొక్కలు ఏర్పాటు చేసుకుని లోపల నుండి పోషకాల నీరు సరఫరా అవుతుందని బహి ర్గతంగా ఉండడంతో సూర్యుడు సూర్యరశ్మి సాహిత్యం సహాయంతో అవి ఆరోగ్యంగా పెరుగుతాయని నీటి వృధా ఉండదని వివరించింది. దీంతోసైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థిని రూపను, గైడ్ టీచర్ మహిపాల్‌ను ఏకశిలా విద్యా సంస్థల అధినేత తిరుపతిరెడ్డిలు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రామాంజనేయులు, అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ముందస్తు చర్యలు

**గద్వాల టౌన్, జనవరి 13 ప్రభాతవార్త :** మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్సైజ్ పోలీసులు, డిటిఎస్ బృందం జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులను తనిఖీ చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో జమ్మిచెడు చౌరస్తావద్ద రూట్‌మ్యాప్ నిర్వహించి వాహనాలు తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణా, సారా అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని ఎక్సైజ్ సిఐ గోపాల్ తెలిపారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.